క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



వెల్దుర్తిలో క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న ఎంఈఓ

వెల్దుర్తి(తూప్రాన్): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎంఈఓ యాదగిరి అన్నారు. సీఎం కప్ 2024లో భాగంగా వెల్దుర్తి ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామస్థాయి క్రీడాపోటీలను మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని మండల స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

నిరుపేదలను గుర్తించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా, ఎంపీఓ తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాపాలన భాగంగా దరఖాస్తు చేసుకున్న ఇళ్లులేని వారి వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వారి వివరాలు ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. ఈ నెలాఖరు వరకు వివరాలు నమోదు పూర్తి చేయాలని సూచించారు. ప్రజా పాలన భాగంగా మండల వ్యాప్తంగా 3500 పై చిలుకు కుటుంబాలు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. సమగ్రంగా వివరాలు తప్పులు లేకుండా పూర్తి చేయాలని సూచించారు.

అంగన్‌వాడీలో వైద్యపరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని శేరితండా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఏఎన్‌ఎం రాజమణి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అవసరం ఉన్నవారిక రోగనిరోధక టీకాలు వేశారు. మహిళల్లో రక్తహీనతను నివారించేందుకు పాలు, కోడిగుడ్డు, ఆకుకూరలు ఆహారంలో ప్రతిరోజు తినాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, అనూష, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు



పథకాలను వివరిస్తున్న కళాకారులు

రేగోడ్(మెదక్): రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కళాకారులు సిద్దులు, రామారావు, ఎల్లయ్య, కృష్ణ, దేవదాస్, విజయలక్ష్మి, శేఖర్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాలతో మండల కేంద్రం రేగోడ్‌తో పాటు దోసపల్లి, కొండాపూర్ గ్రామాల్లో శనివారం ప్రజాపాలన విజయోత్సవాల్లో ఆటపాటల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

నత్నయ్యపల్లిలో తాగునీటి ఎద్దడి



మినీ ట్యాంక్ వద్ద నీటిని తీసుకెళ్తున్న గ్రామస్తులు

నర్సాపూర్ రూరల్: తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండలంలోని నత్నయపల్లి గ్రామస్తులు శనివారం తెలిపారు. వారం రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా రాకపోవడంతో దూర ప్రాంతంలోని జెట్ పంపును ఆశ్రయించి గ్రామస్తులమంతా అవసరాలు తీసుకుంటున్నామని చెప్పారు. ట్యాంక్ బోరు మోటార్ పాడైపోయిందని, అధికారులు మరమ్మతులు చేయకుండా వదిలేశారన్నారు. పలుమార్లు కార్యదర్శితో పాటు అధికారులకు విన్నవించినా.. ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శిని వివరణ కోరగా.. నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వేలాడుతున్న మృత్యుపాశాలు

- పొలాల్లో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



నర్సాపూర్ రూరల్: తుజాల్‌పూర్ పంట పొలంలో విద్యుత్ తీగలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): అజ్జమర్రిలోని పొలంలో వేలాడుతున్న తీగలను చూపుతున్న రైతు

నర్సాపూర్ రూరల్: పంట పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉన్న ఎవరు పట్టించుకోవడంలేదని మండలంలోని తుజాల్‌పూర్ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంట పొలాల్లో కుకునూరి స్వామి పంట పొలం మీదుగా పలు రైతుల పొలాల ఉన్న విద్యుత్ తీగలు కొన్ని నీళ్లగా వేలాడుతూ ప్రమాదంగా మారాయి. పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించగా స్తంభాల కోసం డీడీలు కడితే వేలాడుతున్న విద్యుత్‌స్తంభాలు వేసి, పైకి అమరుస్తామని చెప్పారు. ఐదేళ్ల క్రితం గ్రామానికి చెందిన పటేల్ స్వామితో పాటు పలువురు రైతులు స్తంభాల కోసం డీడీలు చెల్లించారు. అప్పటి నుంచి ఈరోజు వరకు విద్యుత్ శాఖ రేపు.. మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కొత్త స్తంభాలను అమర్చి వేలాడుతున్న విద్యుత్ తీగలను పైకి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని అజ్జమర్రి గ్రామ శివారులో ఉన్న పొలాల్లో విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. పొలాల్లో ట్రాక్టర్ పనులు చేసుకోవాలన్న, వరికోత మిషన్ రావాలన్న ఎల్‌సీ తీసుకోవాల్సిన పరిస్థితి నెలకుంది. ప్రమాదకరంగా ఉన్న ఆ విద్యుత్ తీగను సరిచేయాలని గ్రామ రైతులు విద్యుత్ సిబ్బందికి ఎన్నిసార్లు విన్నవించినా.. వారు పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామస్తులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సిబ్బంది తగు చర్యలు తీసుకొని విద్యుత్ తీగలను సరిచేయాలని వారు కోరుతున్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు

- తహసీల్దార్ జ్ఞానజ్యోతి



వాహనాలను సీజ్‌చేసి వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్

వెల్దుర్తి(తూప్రాన్): ముందస్తు అనుమతులు లేకుండా మట్టిని తరలించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మాసాయిపేట తహసీల్దార్ జ్ఞానజ్యోతి హెచ్చరించారు. మండలంలోని బొమ్మారం గ్రామంలోని హల్దీవాగు పరవాహక ప్రాంతం నుంచి అక్రమ మట్టి రవాణాను గ్రామస్తులు అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మూడు టిప్పర్లు, ఒక హిటాచీ యంత్రం ద్వారా మట్టిని తరలిస్తుండగా, మాజీ సర్పంచ్ శంకర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు అడ్డుకొని తహసీల్దార్, చేగుంట పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న తహసీల్దార్ మట్టి తరలింపుకు ఎలాంటి అనుమతులు లేవని గుర్తించి వాహనాలను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. వాహన యజమానులపై కేసులు నమోదు చేయనున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు.

విద్యార్థులు పాల్గొనడం హర్షణీయం



విద్యార్థులతో లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు

- టీటీడీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ

చిలప్‌చెడ్(నర్సాపూర్): భగవద్గీత కంఠస్థ పోటీల్లో విద్యార్థులు పాల్గొని, ప్రతిభ కనబరచడం హర్షణీయమని టీటీడీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ శర్మ అన్నారు. శనివారం మండల పరిధిలోని జగ్గంపేట నవభారతి మోడల్ స్కూల్‌లో 2024 గీతా జయంతి ఉత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయి శ్రీమద్ భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన 8, 9తరగతులు, 6, 7 తరగతులకు రెండు విభాగాలుగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు. ప్రశంసాపత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో టీటీడీ ఉపన్యాసకుడు రాంరెడ్డి, హెచ్‌ఎం శ్రీకాంత్‌గౌడ్, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



నర్సాపూర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): బాధిత బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు సత్యనారాయణ శనివారం మృతి చెందాడు. దీంతో ఎమ్మెల్యే భౌతికదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ పరంగా కార్యకర్త కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు కల్లూరి హరికృష్ణ, చంద్రగౌడ్, యాదగౌడ్, లాయక్, శ్రీనివాస్, భిక్షపతి, కుమార్, వీరేశ్, మైపాల్‌రెడ్డి ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు

నర్సాపూర్: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. ఆమె శనివారం నర్సాపూర్, గోమారంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న ఎంఈఓ విఠల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్య, ఉద్యోగాల్లో దివ్యాంగులకు కల్పిస్తున్న రిజర్వేషన్లు అందిపుచ్చుకొని వారు ఉన్నత స్థాయికి ఎదగాలని మండల విద్యాధికారి విఠల్ అన్నారు. మండల కేంద్రం చిలప్‌చెడ్ ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ప్రభుత్వం దివ్యాంగులకు అందించే పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో చందూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం హరిసింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నివారించాలి



బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత

చిలప్‌చెడ్(నర్సాపూర్): బాల్య వివాహాలు చేస్తే ఇరువైపులా తల్లిదండ్రులు, వివాహాన్ని ప్రోత్సాహించే ప్రతీ ఒక్కరు శిక్షార్హులు అవుతారని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు. శనివారం ఆమె, విశ్వసనీయ సమాచారం మేరకు రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో కలిసి మండలంలోని సోమక్కపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని గంగిరెద్దులగూడెంలో బాల్య వివాహానికి సిద్ధమైన తల్లిదండ్రులకు, మైనర్ బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గంగిరెద్దుగూడెం గ్రామానికి వెళ్లి, వయసు రాకుండానే పెళ్లి చేస్తే, అమ్మాయికి జరిగే నష్టాల గురించి తెలియజేశామన్నారు. అమ్మాయికి 18 ఏళ్లు నిండిన తర్వాతనే పెళ్లి చేస్తామని వారి తల్లిదండ్రులతో ఒప్పందపత్రం రాయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ నర్సింహులు, ఆర్‌ఐ సునీల్‌సింగ్, ఐసీపీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్ రెడ్డి



మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి

తూప్రాన్: ఉద్యోగ, ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెండింగ్ మెడికల్, జీపీఎఫ్ బిల్లులు విడదలతో పాటు మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శి దుబాషి భాస్కర్, మహిళా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వరూప రాణి, సుజాత, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాను ప్రసాద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చాకరిమెట్లలో భక్తుల పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామ పరిధిలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు సత్యనారాయణ స్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితా డ్రాఫ్ట్ విడుదల

తూప్రాన్: మండలంలోని గ్రామ పంచాయతీల ఓటరు జాబిత ప్రచురణను ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ శేషాద్రి డ్రాఫ్ట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 114 వార్డులు ఉన్నాయని తెలిపారు.

చేగుంటలో..

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంతో పాటు గ్రామ పంచాయతీల నోటీసు బోర్డుల్లో ఎన్నికల డ్రాఫ్టుతో పాటు పోలింగ్ కేంద్రాల వివరాలను ఏర్పాటు చేశామని ఎంపీడీఓ చిన్నారెడ్డి తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయం నోటీసు బోర్డుపై డ్రాఫ్టును ఏర్పాటు చేయించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 12 వరకు ఎంపీడీఓ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా అందించాలని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమాల్లో సిబ్బంది శ్రీశైలం, విజయ్ తదితరులు ఉన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట(మెదక్): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ బూత్‌లను గుర్తించిన అధికారులు వాటి జాబితాను శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రదర్శనకు పెట్టారు. ఎంపీడీఓ దామోదర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ గిరజారాణి ఉన్నారు.

అంబులెన్స్ కేటాయింపుపై హర్షం

వెల్దుర్తి(తూప్రాన్): మెదక్ జిల్లాలో ఇటీవల పూర్తిస్థాయి మండలంగా హోదా పొందిన మాసాయిపేటకు ప్రభుత్వం 108 అంబులెన్స్ వాహనం కేటాయించడంపై గ్రామస్తులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే గ్రామ నివాసి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి ప్రత్యేక చొరవతో మండల పరిషత్‌గా పూర్తి హోదా పొంది, ఒక్కో ప్రభుత్వ కార్యాలయం ఏర్పాటు చేయడంతో పాటు మెరుగైన వైద్యసేవలు అందేలా అంబులెన్స్ కేటాయించడం తో మాసాయిపేట మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్ నాగిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహులు కృతజ్ఞతలు తెలిపారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని బండపోతుగల్ గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలించిన ఇసుక డంప్‌లను మూడు రోజుల క్రితం సీజ్ చేశారు. ఆ ఇసుకను శనివారం గ్రామ పంచాయతీ ఆవరణలో వేలం వేశామని తహసీల్దార్ ముసాద్దిక్ అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆరుచోట్ల సీజ్ చేసిన ఇసుకను వేలం వేయగా, రూ. 1.74 లక్షలకు కొనుగోలు చేశారన్నారు. ఇసుకను కొనుగోలు చేసి వ్యక్తులు సోమవారం సాయంత్రం వరకు తహసీల్దార్ చిలప్‌చెడ్ మండల్ పేరు మీద డీడీలు తీసి ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఇసుకను తరలించే వాహనాల నంబర్లు, వివరాలు ఇవ్వాలన్నారు. ఇతర వాహనాల్లో ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని, ఉదయం 9 నుంచి, సాయంత్రం 5 వరకు ఇసుక తరలింపు అనుమతి ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సింధూజ, ఎస్‌ఐ నర్సింహులు, ఆర్‌ఐ సునీల్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు రద్దు చేయాలి



వెల్దుర్తిలో ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు



అల్లాదుర్గంలో ఆటో డ్రైవర్ల నిరసన



బొడ్మట్‌పల్లిలో ..

- ఆటో డ్రైవర్ల ధర్నా

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలోని అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం ఆటో డ్రైవర్లు ధర్నా చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం రద్దు చేయాలంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత ప్రయాణంతో తాము సమస్యలు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఆ పథకాన్ని వెంటనే రద్దుచేసి, తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆందోళనలో ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు భాషాగౌడ్, ఉపాధ్యక్షుడు షాబొద్దీన్, ప్రవీణ్, బాలేశ్, మహేశ్, ప్రవీణ్‌గౌడ్, గోపాల్‌గౌడ్, మహిపాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

అల్లాదుర్గం(మెదక్): ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నేరవేర్చాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. అల్లాదుర్గంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజు, నాగరాజు, విఠల్, దుర్గయ్య పాల్గొన్నారు.

బొడ్మట్‌పల్లిలో..

టేక్మాల్(మెదక్): ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం తమ పొట్టగొట్టిందని మండలంలోని బొడ్మట్‌పల్లి చౌరస్తాలో ఆటో డ్రైవర్‌లు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఆటోలన్ని రోడ్డుపై వరుస క్రమంలో నిలిపి ప్రభుత్వం తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు నెలసరి వేతనం ప్రభుత్వం ప్రకటించాలని కోరారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

మనోహరాబాద్(తూప్రాన్): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిలుగా పాల్గొని మాక్ పోలింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడలతో పాటు అన్ని రంగాల్లో పట్టు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. మాక్ పోలింగ్‌లో విద్యార్థిని అక్షయ అత్యధిక మెజార్టీతో గెలుపొందింది. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మీనర్సయ్య, ఇన్‌చార్జి హెచ్‌ఎం కృపాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రేషన్ దుకాణం తనిఖీ

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని రేషన్ దుకాణాలను సివిల్‌సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. శనివారం చిన్నశంకరంపేటలోని రేషన్ దుకాణంలో బియ్యం బస్తాలను తూకం వేసి చూశారు. ఈ సందర్భంగా స్టాక్‌ను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఒక్కో బియ్యం బస్తా ఎంత తూకం వస్తుందని తూకం వేసి చూశారు. రోజు రేషన్ ఇస్తున్నారా అని వినియోగదారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడారు.

◆ బీజేపీ నూతన కమిటీ నియామకం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో శనివారం బీజేపీ గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడు దయాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. 1వ బూత్ అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్, 2వ భూత్ అధ్యక్షుడిగా శేఖర్ యాదవ్, సెక్రటరీగా సంతోష్ కుమార్, దుర్గగౌడ్, వాట్సాప్ గ్రూప్ కమిటీ అధ్యక్షుడిగా నయీమ్, రాజు, ప్రధాన కార్యదర్శగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు ఎంచర్ల శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

◆ గోశాలకు పశుగ్రాసం అందజేత



శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి వేణుగోపాల స్వామి ఆలయ గోశాలకు దాత శనివారం ఎండు పశుగ్రాసం అందజేశాడు. గోశాలలో పశుగ్రాసం కొరత ఉందని నిర్వాహకులు తెలపడంతో శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి రూ. 10 వేల విలువ చేసే పశుగ్రాసం (ఎండు గడ్డి) గోశాలకు అందజేశాడు. కార్యక్రమంలో లక్ష్మీకాంతారావు, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

◆ మంత్రి హామీతో బంద్ వాయిదా

నర్సాపూర్: రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీతో శనివారం చేపట్టాల్సిన రాష్ట్ర బంద్‌ను వాయిదా వేశామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు చెప్పారు. ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయనందున శనివారం రాష్ట్ర బంద్‌కు జేఏసీ ఆధ్వర్యంలో పిలుపు ఇవ్వగా శుక్రవారం రాత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ జేఏసీ నాయకులతో చర్చించారని, సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో బంద్ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ఆయన వివరించారు.

◆ వార్డుల వారీగా ఓటరు జాబితా

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామ పంచాయతీ ఓటర్లకు సంబంధించి వార్డుల వారీగా జాబితాను పబ్లికేషన్ చేసినట్లు ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా, ఎంపీఓ తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంతో పాటు మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో వార్డులు, పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటరు జాబితాను ఉంచామన్నారు. రానున్న లోకల్ ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని ఓటరు జాబితాను వార్డుల వారీగా విభజించి, పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు.

◆ ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

మనోహరాబాద్(తూప్రాన్): తూప్రాన్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని దండుపల్లి వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో శనివారం కొనుగోళ్లు ముగిశాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6638 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు.

◆ వాహనం ఢీకొని జింకకు గాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఎస్.కొండాపూర్ అటవీప్రాంతంలో రొడ్డుపై కృష్ణ జింకను వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. శుక్రవారం అర్ధరాత్రి పెట్రోలింగ్‌కు వెళ్లిన పోలీస్‌లు మెదక్–చేగుంట రోడ్డుపై ప్రమాదానికి గురైన జింకను గుర్తించారు. వెంటనే జింకను రోడ్డుపై నుంచి పక్కకు తప్పించి అటవీశాఖ అధికారులు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారి కుత్బోద్దీన్ సంఘటన స్థలానికి వచ్చి జింకను స్వాధీనం చేసుకున్నారు.

◆ కేజీబీవీ తనిఖీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులోని కేజీబీవీని శనివారం ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన కేజీబీవీ పరిసరాలు, స్టోర్ రూం, వంటశాల, వండిన భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్ర వాతావరణంలో వంట చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్యామ్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

◆ సేవాలాల్ జయంతి రోజు సెలవు ప్రకటించాలి

టేక్మాల్(మెదక్): సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని ఫిబ్రవరి 15న సెలవు ప్రకటించాలని బంజారా సేవాలాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్‌నాయక్ కోరారు. శనివారం బంజార సంఘం నాయకులు టేక్మాల్‌లో మాట్లాడారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫిబ్రవరి 15న సేలువుదినం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా బంజారా సేవాలాల్ సంఘ సమాచార కార్యదర్శి రాజునాయక్, గిరిజన నాయకులు రవీందర్ నాయక్, లక్ష్మణ్ చౌహాన్, రెడ్య నాయక్, లంబాడా గిరిజన సంఘం ఉపాధ్యక్షులు సురేశ్, విఠల్ నాయక్, సురేశ్‌నాయక్, దాసు నాయక్ ఉన్నారు.

◆ సన్మానం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించిన కానిస్టేబుల్ జానీ బదిలీపై వెళ్తుడడంతో శనివారం ఆయన్ను సన్మానించారు. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ దేవదాస్, ఇతర సిబ్బంది శాలువాతో సన్మానించి అభినందించారు. అకింత భావంతో ఎక్కడ విధులు నిర్వహించిన ప్రజలు గుర్తిస్తారని ఎస్‌ఐ అన్నారు.

◆ కట్టుబడి పనిచేస్తున్న ప్రభుత్వం

శివ్వంపేట(నర్సాపూర్): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తుందని కాంగ్రెస్ నాయకుడు నవీన్‌గుప్తా శనివారం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడి సంవత్సర కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంతో పాటు కొత్త పథకాలను ప్రజలకు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.